సాక్షి ఖమ్మం

1

బుధవారం । 9 । అక్టోబర్ । 2024



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పక్కన ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రణాళిక

- రైతులకు మేలు చేసేలా పంపుసెట్లకు సోలార్ విద్యుత్
- మధిర నియోజకవర్గం సిరిపురంలో పైలెట్ ప్రాజెక్టు
- పొలం బాట ద్వారా విద్యుత్ సమస్యల పరిష్కారం
- ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 2029–2030 వరకు 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల విద్యుత్ అధికారులతో శాఖ పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ విద్యుత్ వినియోగం పెరుగుతున్న దృష్ట్యా వ్యవస్థను పటిష్టపరచడానికి కావాల్సిన బడ్జెట్ కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడకుండా అదనంగా ఏర్పాటుచేస్తామని చెప్పారు. గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్ పథకంతో ఉమ్మడి ఖమ్మం సర్కిల్ పరిధిలో 26 లక్షల మందికి లబ్ధి చేకూరిందని డిప్యూటీ సీఎం తెలిపారు.

తలసరి ఆదాయం పెరుగుదలలో కీలకపాత్ర

వ్యవసాయానికి ఇప్పటికే ఉచిత విద్యుత్ అందిస్తున్నామని.. రైతుల పంపుసెట్లకు కావాల్సిన విద్యుత్ అందిస్తూనే ఆదాయం సమకూరేలా సోలార్ విద్యుత్ యూనిట్లు ఇస్తామని భట్టి తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మధిర మండలం సిరిపురాన్ని ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ గ్రామంలోని ఇళ్లకు కూడా సోలార్ ప్యానళ్లు బిగించి పూర్తిస్థాయి సౌర విద్యుత్ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రాభివృద్ధి, తలసరి ఆదాయం పెరిగేలా నాణ్యమైన కరెంట్ అందించడంలో కీలకమైన పాత్ర విద్యుత్ శాఖదేనని వెల్లడించారు. ఇటీవల వరదల సమయాన అర్ధరాత్రి సైతం పనిచేసిన విద్యుత్ ఉద్యోగులంతా అభినందనీయులన్నారు. కాగా, రైతుల విద్యుత్ సంబంధిత సమస్యల తెలుసుకునేందుకు పొలంబాట కార్యక్రమం ఉపయోగపడుతోందని డిప్యూటీ సీఎం తెలిపారు. అలాగే, ట్రాన్స్‌ఫార్మర్ల షెడ్లను తనిఖీ చేయాలని, లైన్‌మెన్లు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించేలా అవగాహన కల్పించాలని.. విద్యుత్ సంబంధిత ఫిర్యాదులపై 1912కి ఫోన్ చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

వరదలతో రూ.30 కోట్లు నష్టం

ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాలు, వరదలతో విద్యుత్ శాఖకు రూ. 30 కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. రాత్రింబవళ్లు పనిచేసి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించామని చెప్పారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ వరదల సమయాన విద్యుత్ సిబ్బంది విశేష సేవలందించారని చెప్పారు. అనంతరం మెరుగైన సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందచేశారు. ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, మాలోతు రాందాస్ నాయక్, ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, సీజీఎంలు కె.రాజుచౌహాన్, కె.కిషన్, కే.ఎన్.గుట్ట, బికం సింగ్, ఎస్ఈలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు హాస్టళ్లలో రాత్రి బస చేయాలి

జిల్లా అధికారులు ప్రతీ పదిహేను రోజులకోసారి సంక్షేమ వసతి గృహాల్లో రాత్రి వేళ బస చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సూచించారు. కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖలపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి ఆయన సమీక్షించారు. ఏదైనా తేడా వస్తే వార్డెన్‌ను కాకుండా సంబంధిత జిల్లా అధికారిపైనే చర్యలు తీసుకుంటామన్నారు. స్కాలర్ షిప్, కాస్మోటిక్స్, డైట్ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలి పారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ చేయాల్సి ఉండగా, 20 పాఠశాలలకు మాత్రమే ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. హైవేల నిర్మాణ సమయాన దెబ్బతిన్న స్థానిక రోడ్ల మరమ్మతుకు హైవే నిర్మాణ సంస్థల నుంచి నిధులు సమీకరించాలని తెలిపారు. జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు ఖమ్మంలో ఓ ఆస్పత్రిని ప్రారంభిస్తారు. ఆతర్వాత ఖమ్మం 20వ డివిజన్ సాయినగర్ రోడ్డు నంబర్-1, రఘునాథపాలెం మండలం మంగ్యా తండా, కేవీ బంజర, మూలగూడెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారు.

మంత్రి పొంగులేటి...

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఉదయం జిల్లాలో పర్యటించనున్నారు. స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురం నుండి బయలుదేరనున్న ఆయన ఖమ్మంలో ఓ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఆతర్వాత ఖమ్మం కైకొండాయిగూడెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశాక, టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం రూరల్ మండల కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారు.

శ్రీలలితా పరమేశ్వరీ.. పాహిమాం


శ్రీలలితా పరమేశ్వరి అలంకారంలో అమ్మవారు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ఆరో రోజుకు చేరాయి. ఈసందర్భంగా తెల్లవారుజామున శ్రీవారికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత యాగశాలలో శ్రీఅలివేలుమంగ అమ్మవారిని శ్రీలలితా పరమేశ్వరి రూపంలో అలంకరించగా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ, అర్చకులు ఉప్పల మురళీమోహన్ శర్మ, రాజీవ్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ రిజర్వేషన్‌కు కొత్త వెబ్‌సైట్

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సుల్లో సీట్ల రిజర్వేషన్ కోసం కొత్త వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చిందని ఖమ్మం రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి www.tgsrtcbus.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సీట్లు రిజర్వేషన్ చేయించుకోవాలని సూచించారు. గతంలో ఉన్న టీఎస్‌ఆర్టీసీ వెబ్‌సైట్‌కు బదులు కొత్త సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆర్‌ఎం తెలిపారు.

నేటి నుండి సదరమ్ క్యాంపులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బుధవారం నుండి సదరమ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 9, 15, 22, 29వ తేదీలతో పాటు నవంబర్ 5, 12, 19, 26, డిసెంబర్ 3, 10, 17, 31వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు క్యాంపులు కొనసాగుతాయని వెల్లడించారు. ఈమేరకు దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకున్న రశీదు, ఆధార్ కార్డ్ జిరాక్స్, పాస్ పోర్ట్ ఫొటో, వైద్యపరీక్షల నివేదికలు వెంట తీసుకురావాలని సూచించారు.

కారుణ్య నియామకాలకు 17న కౌన్సెలింగ్

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో కారుణ్య నియామకాల్లో భాగంగా కండక్టర్ల ఎంపికకు ఈనెల 17న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్ ద్వారా 43 మంది, మెడికల్ రిటైర్మెంట్ స్కీమ్ ద్వారా 23 మంది దరఖాస్తు చేసుకోగా ఖమ్మం కొత్త బస్టాండ్‌లో 17వ తేదీన ఉదయం 10గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆర్‌ఎం సరిరామ్ తెలిపారు. అభ్యర్థులు కాల్‌లెటర్‌లో సూచించిన విధంగా ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఒక ప్రకటనలో సూచించారు.

రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభించారు. మొదటి విడతలో రాష్ట్ర కోటా ద్వారా 65 మంది, జాతీయ కోటాలో 12 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. కాగా, రాష్ట్ర కోటాలో సీట్లు పొందిన 15 మంది స్లైడింగ్‌లో భాగంగా ఇతర కళాశాలలకు వెళ్లిపోయారు. ఇక రెండో విడత కౌన్సెలింగ్‌లో ఐదుగురు ప్రవేశాలు పొందగా.. ఇప్పటివరకు రాష్ట్ర కోటాలో మొత్తం 55 మంది విద్యార్థులు చేరినట్లయింది.

కొత్త టీచర్లు.. 532 మంది!

- 2024 డీఎస్సీ తుది జాబితా విడుదల
- నేడు సీఎం చేతుల మీదుగా నియామకపత్రాలు
- కొత్త ఉపాధ్యాయుల కుటుంబాల్లో దసరా సందడి



ఖమ్మం సహకారనగర్: 2024 డీఎస్సీ నియామకాల ప్రక్రియ చివరి దశకు చేరింది. గత నెల 30వ తేదీన ప్రభుత్వం ఫలితాలను విడుదల చేయగా 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈనెల 2నుంచి 5వ తేదీ వరకు పరిశీలించారు. ఇందులో ప్రతిభ ఆధారంగా ఎంపికైన అభ్యర్థుల వివరాలను మంగళవారం వెల్లడించారు. అంతేకాక ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సెల్‌ఫోన్లకు మెసేజ్ సైతం పంపించారు.

575లో 532 పోస్టులు భర్తీ

జిల్లాలోని పాఠశాలల్లో 575పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ గుర్తించింది. ఈమేరకు డీఎస్సీ ద్వారా ఇంతే సంఖ్య పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించారు. అయితే, రకరకాల కారణాలతో అన్ని కేటగిరీల్లో కలిపి 532మందిని మాత్రం ఎంపిక చేశారు. మిగతా వాటిలో స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంతో పాటు బ్యాగ్ లాగ్ పోస్టులు ఉండగా వివిధ సమస్యలతో భర్తీ నిలిపివేసినట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

ఆ ఇళ్లలో దసరా సందడి

డీఎస్సీలో ఉపాధ్యాయలుగా ఎంపికైన వారి ఫోన్లకు మంగళవారం సాయంత్రంకల్లా మెసేజ్‌లు అందాయి. అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయ నియామకపత్రం అందించనున్నారు. దీంతో పలువురు డీఈఓ కార్యాలయం వద్దకు చేరుకుని జాబితాలో పేర్లు సరిచూసుకుని కుటుంబాలతో ఆనందాన్ని పంచుకున్నారు. ఫలితంగా నాలుగు రోజుల ముందే ఆయా కుటుంబాల్లో దసరా వెలుగులు నిండినట్లయింది.

కేటగిరీల వారీగా పోస్టుల వివరాలు

కేటగిరీ	పోస్టులు	భర్తీ
స్కూల్ అసిస్టెంట్	176	174
లాంగ్వేజ్ పండిట్	18	17
పీఈటీ	10	10
ఎస్‌జీటీ	334	331
ఎస్ఏ (స్పెషల్ ఎడ్యుకేషన్)	8	0
ఎస్‌జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్)	29	0
మొత్తం	575	532

కలెక్టరేట్ నుంచి బస్సులు

ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని హైదరాబాద్ తీసుకెళ్లేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. కలెక్టరేట్ నుంచి ఉదయం 6–30 గంటలకు 13 బస్సులు బయలుదేరతాయని చెప్పారు. బస్సులో అభ్యర్థికి మాత్రమే అనుమతి ఉంటుందని.. దివ్యాంగులు, చంటిబిడ్డలకు పాలిచ్చే తల్లులు, గర్భిణుల వెంట మాత్రం సహాయకులను అనుమతిస్తామని డీఈఓ తెలిపారు.

కులవృత్తుల పరిరక్షణకు కృషి


చేపపిల్లలు వదులుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన మెట్టు సాయికుమార్, అదనపు కలెక్టర్ శ్రీజ, తదితరులు

- మత్స్యకారుల అభివృద్ధికే ఉచితంగా చేపపిల్లలు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: కులవృత్తుల అభివృద్ధి, పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మండలంలోని పాలేరు రిజర్వాయర్‌లో మంగళవారం ఆయన చేపపిల్లలను విడుదల చేసి మాట్లాడారు. రాష్ట్రంలో మార్పు కోరుతూ ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొచ్చారని.. ఆ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందరి సంక్షేమం కోసం పాటుపడుతున్నామని తెలిపారు. ఇటీవల వచ్చిన వరదలతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయినందున పరిహారం చెల్లించడమే కాక మహిళా మత్స్యకారులకు రివాల్వింగ్ ఫండ్ వచ్చేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే ఇళ్లు కోల్పోయిన మత్స్యకారులకు రిజర్వాయర్ పరిసరాల్లో మరోచోట ఇంటి స్థలాలను కేటాయిస్తామని తెలిపారు. పాలేరు రిజర్వాయర్‌లో సరిపడా చేప పిల్లలను విడుదల చేయడం లేదని మత్స్యకారులు మంత్రి దృష్టికి తీసుకురాగా.. సామర్థ్యం మేరకు చేపపిల్లలే కాక రొయ్య పిల్లలను కూడా ప్రభుత్వం ఆధ్వర్యాన పంపిణీ చేయిస్తామని వెల్లడించారు. అలాగే, మత్స్యకారుల సమస్యలను అక్కడి నుంచే శాఖ కమిషనర్‌కు ఫోన్‌లో వివరించి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఫిషరీష్, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల చైర్మన్లు మెట్టు సాయికుమార్, మువ్వా విజయ్‌బాబు, అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్డీఓ గణేష్, మత్స్యశాఖ జేడీ లక్ష్మీనారాయణ, ఏడీ శివకుమార్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డితో పాటు మద్దినేని బేబీ స్వర్ణకుమారి, మామిడి వెంకటేశ్వర్లు, ఇస్లావత్ ఉపేందర్, దేశబోయిన ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


ఉద్యోగినులతో కలిసి బతుకమ్మ ఎత్తుకున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ప్రకృతిని పూజించడం ఈ పండుగ ప్రత్యేకత అని చెప్పారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.

అటవీశాఖ కార్యాలయంలో...

ఖమ్మంవన్‌టౌన్: బతుకమ్మ పండుగకు తెలంగాణ సంస్కృతిలో విశిష్ట స్థానం ఉందని జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ తెలిపారు. అటవీశాఖ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. ఈసందర్భంగా డీఎఫ్ఓ సతీసమేతంగా పాల్గొని మాట్లాడారు. మహిళలంతా ఒక్కచోట చేరి ఆనందంగా గడిపే అపురూప దృశ్యం బతుకమ్మతో వస్తుందని తెలిపారు. ఎఫ్‌డీఓ మంజుల, ఎఫ్ఆర్‌ఓ నాగేశ్వరరావు, ఏఓలు కృష్ణారావు, వెంకట్ సోలోమన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మ ఎత్తుకున్న తన సతీమణి, బంధువులతో డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్

సత్తుపల్లిలో భారీ చోరీ

- రూ 28.66 లక్షల సొత్తు అపహరణ

సత్తుపల్లి: ఉదయం బంధువుల ఇంటికి వెళ్లి సాయంత్రం వచ్చేసరికి రూ.28.66 లక్షల సొత్తును దుండగులు అపహరించారు. సత్తుపల్లిలో మంగళవారం జరిగిన ఈ చోరీ వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లి గాంధీనగర్లో ఆర్అండ్ బీ ఉద్యోగి ఎం.డీ.గులామ్ ఫహీముద్దీన్ నివసిస్తున్నాడు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఉదయం ఖమ్మం వెళ్లి సాయంత్రం వచ్చాడు. అప్పటికే ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో లోపల పరిశీలించగా బీరువా పగలగొట్టి అందులోని దుస్తులు చిందరవందరగా పడేసి కనిపించాయి. ఈ ఘటనలో రూ.28 లక్షల విలువైన 40 తులాల బంగారం, రూ.36 వేలు విలువైన 30 తులాల వెండి, రూ.30 వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. పట్టణంలో పట్టపగలే భారీ చోరీ జరగడంతో గులామ్ కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దసరా సెలవుల్లో చాలామంది ఇళ్లకు తాళాలు వేసి స్వస్థలాలు, బంధువుల ఇళ్లకు వెళ్లడంతో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, చోరీ జరిగిన ఇంట్లో క్లూస్‌టీంతో కలిసి ఏసీపీ అనిశెట్టి రఘు, సీఐ టి.కిరణ్ పరిశీలించి విచారణ చేపట్టారు.

క్లుప్తంగా

మంత్రిని కలిసిన మార్క్‌ఫెడ్ పాలకవర్గం


మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పాలకవర్గ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: మార్క్‌ఫెడ్ రాష్ట్ర పాలకవర్గం మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిసింది. మార్క్‌ఫెడ్ చైర్మన్ మారం గంగారెడ్డి, డైరెక్టర్, ఖమ్మం డీసీఎంఎస్ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు, మేనేజింగ్ డైరెక్టర్ వి.శ్రీనివాసరెడ్డి తదితరులు మంత్రిని కలిసి సత్కరించారు. ఆతర్వాత మార్క్‌ఫెడ్ కార్యకలాపాలపై ఆరా తీసిన మంత్రి పలుల సూచనలు చేశారు.

ఖమ్మం మార్కెట్‌లోకి జావా 42ఎఫ్‌జే


బైక్‌ను ఆవిష్కరిస్తున్న డీటీసీ, తదితరులు

ఖమ్మంక్రైం: జావా ద్విచక్ర వాహనాల కంపెనీ నుంచి కొత్తగా రూపొందించిన 42ఎఫ్‌జే బైక్‌ను ఖమ్మం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ బైక్‌ను ఖమ్మం మమతా రోడ్డులోని జీకే ఆటోమోటివ్స్‌లో వరంగల్ డీటీసీ శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఇన్‌చార్జ్ డీటీఓ వెంకటరమణ, షోరూమ్ నిర్వాహకులు గౌతమ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రమణ, పద్మ


మెరుగు రమణ, బండి పద్మ

ఖమ్మంమయూరిసెంటర్: ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మెరుగు రమణ, బండి పద్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలో జరిగిన సంఘం 12వ జిల్లా మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వెల్లడించారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులుగా మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, షేక్ మెహరున్నీసా బేగం, సహాయ కార్యదర్శులుగా పయ్యవుల ప్రభావతి, పి.నాగసులోచన, ఆఫీస్ బేరర్లుగా శీలం కరుణ, జొన్నలగడ్డ సునీత, పెండ్యాల సుమతి, బెల్లం లక్ష్మీ, గుడిమెట్ల రజిత, కత్తుల అమరావతి ఎన్నికయ్యారని తెలిపారు.

కోటమైసమ్మ జాతర ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఏసీ వీరస్వామి

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లిలో శ్రీకోటమైసమ్మ తల్లి జాతర ఈనెల 12నుంచి 16వ తేదీ వరకు జరగనుంది. ఈ మేరకు ఆలయ ఆవరణలో ఏర్పాట్లను దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వేలాదిగా వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా తాగునీటితో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తామని, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు బందోబస్తు ఉంటుందని తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పర్సా కృష్ణారావు – దమయంతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్మించిన సత్రాన్ని ఆయన ప్రారంభించారు. పర్సా ట్రస్ట్ చైర్మన్ పర్సా పట్టాభిరామారావు, ఆలయ ఈఓ వేణుగోపాలాచార్యులు, ప్రధాన పూజారి కొత్తలంక కైలాషశర్మ, ఉద్యోగులు పగడాల మోహన్‌కృష్ణ, పర్సా లలిత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,251	4,000
మిర్చి	16,500	9,000
మిర్చి తాలు	10,000	8,000
ఏసీ మిర్చి	19,800	10,000
ఏసీ తాలు	9,600	7,000
కొత్త పత్తి	6,851	6,000
పాత పత్తి	7,475	5,400

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.17,043

ఆకట్టు'కొనేలా'!

సద్దుల బతుకమ్మకు ఇంకో రోజు మాత్రమే సమయం ఉంది. ఆతర్వాత రెండు రోజులకు దసరా పండుగ! తెలంగాణలో అతి పెద్దదైన సద్దుల బతుకమ్మ, దసరా పండుగలకు ఇంటిల్లిపాది కొత్త వస్త్రాలు కొనుగోలు చేయడం ఆనవాయితీ. దీంతో జిల్లా కేంద్రంలోని షాపింగ్ మాళ్ల యజమానులు ఆఫర్లు ప్రకటించి ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా షోరూంల వద్ద తాము ప్రకటించిన బహుమతులైన కార్లు, ఇతర వస్తువులను ప్రదర్శించడంతో పాటు ఇతర రాష్ట్రాల కళాకారులతో ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్


కేరళ వాయిద్య కళాకారుల ప్రదర్శన


బంపర్ డ్రాలో ఇచ్చే కారు, బైక్‌లు


ఓ షాపింగ్‌మాల్ వద్ద స్పాట్ గిఫ్ట్‌ల స్టాల్


సంప్రదాయ వేషధారణలో కళాకారులు

డ్యూటీ మీట్‌లో భద్రాద్రి జిల్లా పోలీసులకు పతకాలు

కొత్తగూడెంటౌన్/చంద్రుగొండ/జూలూరుపాడు: వరంగల్‌లో జరిగిన జోనల్‌స్థాయి పోలీసు డ్యూటీ మీట్‌లో భద్రాద్రి జిల్లా పోలీసులు సత్తా చాటారు. పలువురు అధికారులు, ఉద్యోగులు బంగారు, రజిత, కాంస్య పతకాలు సాధించారు. డ్యూటీ మీట్‌లో సాంకేతిక అంశాల ఆధారంగా దర్యాప్తు, కంప్యూటర్ పరిజ్ఞానం, ఫొటోగ్రఫీ, డాగ్ స్క్వాడ్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. సైంటిఫిక్ ఎయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్ విభాగంలో అశ్వారావుపేట సీఐ తాటిపాముల కరుణాకర్ రెండు బంగారు పతకాలతో పాటు కాంస్య పతకం గెలుచుకున్నారు. అలా గే, కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ముప్పారపు కరుణాకర్ ఒక్కో బంగారు, కాంస్య పతకం, టూటౌన్ సీఐ టి.రమేష్‌కుమార్ ఒక వెండి, రెండు కాంస్య పతకాలను సాధించారు. చంద్రుగొండ ఎస్సై గంజి స్వప్న రెండు వెండి పతకాలు, ఇల్లెందు ఎస్సై నాగుల్‌మీరాఖాన్ కాంస్య పతకం, కంప్యూటర్ అవేర్‌నెస్ ప్రోగ్రామింగ్ ఎబిలిటీ విభాగంలో జూలూరుపాడు ఎస్సై రాణాప్రతాప్ బంగారు పతకం గెలుపొందారు. ఇక ఫొటో, వీడియోగ్రఫీ విభాగంలో జిల్లా పోలీసు పీఆర్‌ఓ డి.శ్రీనివాస్ రెండు వెండి పతకాలు, వీడియోగ్రఫీ విభాగంలో కానిస్టేబుల్ కె.నరేందర్ కాంస్య పతకం, సైంటిఫిక్ ఎయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్‌లో కానిస్టేబుల్ ప్రశాంత్ రజిత పతకం, డాగ్ స్క్వాడ్‌లో బంగారు పతకం సాధించడం విశేషం.

గంజాయిపై ఉక్కుపాదం..

- 11 మందిపై కేసు నమోదు
- మరో 82 మంది చైన్ లింక్‌లో...
- వివరాలు వెల్లడించిన ఏసీపీ అనిశెట్టి రఘు


స్వాధీనం చేసుకున్న గంజాయితో ఏసీపీ రఘు, సీఐ కిరణ్, ఉద్యోగులు

సత్తుపల్లి: గంజాయి అమ్మకందారులే కాక కొనుగోలుదారుల కూపీ లాగుతున్న పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇప్పటికే నిఘా వ్యవస్థ ఏర్పాటుచేసి గంజాయి అమ్ముతున్న, వినియోగిస్తున్న వారి స్థావరాలపై దాడులు చేస్తున్నారు. సత్తుపల్లిలో బొగ్గు గనులు విస్తరిస్తుండడమే కాక విద్యా, వాణిజ్య రంగాల్లో అభివృద్ధి చెందుతుండగా.. అదేస్థాయిలో గంజాయి వినియోగ పెరుగుతుందని గుర్తించిన పోలీసులు అప్రమత్తమయ్యారు. గంజాయిని సమూలంగా నిర్మూలించి యువతను రక్షించేందుకు నడుం బిగించారు. ఇందులో భాగంగా రవాణా చేస్తున్న వారు మొదలు అమ్మకందారులు, కొనుగోలు చేసిన వారి వరకు చైన్ లింక్‌లను విశ్లేషిస్తూ మూడంచెల విధానంతో ముందుకెళ్తున్నారు. గంజాయి అమ్మేవారిని కట్టడి చేయటం, గంజాయి సేవించేవారికి తల్లిదండ్రులతో కలిపి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా ఫలితాలు ఉంటాయనే భావనతో నిందితుల నుంచి సేకరించిన సమాచారంతో 82 మంది కొనుగోలుదారులను గుర్తించారు.

ఎవరైనా సరే ఉపేక్షించం

యువత గంజాయికి బానిసలయ్యేలా కారణమవుతున్న వారిని ఉపేక్షించేది లేదని కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు హెచ్చరించారు. సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్‌తో కలిసి మంగళవారం ఆయన మాట్లాడారు. పది రోజులుగా గంజాయి అమ్ముతున్న, సేవిస్తున్న వ్యక్తులపై నిఘా వేసి సోమవారం రాత్రి 11 మందిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించామన్నారు. వీరు ఇచ్చిన సమాచారంతో మరో 82 మందిని విచారిస్తున్నామని చెప్పారు. ఏపీలోని చింతలపూడి మండలం సీతానగరం వద్ద ఒక బైక్‌ను చోరీ చేసిన వ్యక్తులు ఏపీ – ఒడిశా సరిహద్దుల్లో భగవాన్ అనే వ్యక్తి వద్ద మూడు కిలోల గంజాయిని కొనుగోలు చేసి కొంత సొంత అవసరాలకు వాడుకుని, మరికొంత చిన్న ప్యాకెట్లుగా మార్చి రూ.500 చొప్పున అమ్ముతున్నారని తెలిపారు. ఇందులో పాశం వెంకటశివరామకృష్ణ, కొమ్ము మనోవర్ధన్, ఆరుమళ్ల తరుణ్‌కుమార్, వేల్పుల పుల్లారావు, ఒడిశాకు చెందిన భగవాన్, కొత్తపల్లి రత్నబాబు, కువారపు నితిన్‌కుమార్, పాలకుర్తి రాజేష్, రామాల కార్తీక్, నున్నా నవీన్, వెలిశాల వినయ్‌పై కేసు నమోదు చేసి 5.845 కిలోల గంజాయి, ఒక కారు, రెండు మోటారు సైకిళ్లు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో వేంసూరు ఎస్సై గోపాలకృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా, గంజాయి నిర్మూలనకు కృషి చేస్తున్న సీఐ టి.కిరణ్, ఉద్యోగులను ఖమ్మం సీపీ సునీల్‌దత్ అభినందించారని ఏసీపీ రఘు తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ స్థల పరిశీలన


స్థలం మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్)లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంగళవారం పరిశీలించారు. ఈ నెల 11న శంకుస్థాపన జరగకుండా ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. లక్ష్మీపురం రెవెన్యూ పరిధి 25ఎకరాల్లో నిర్మించనున్న పాఠశాలకు రహదారి, ఇతర సౌకర్యాలపై ఆరాతీశారు. గోవిందాపురం(ఎల్), లక్ష్మీపురం, రామాపురం, పాతర్లపాడు నుండి స్కూల్ వరకు డబుల్ రోడ్లు నిర్మించనుండగా ఇప్పటికే స్కూల్ నుండి గోవిందాపురం(ఎల్) వరకు 60అడుగుల రహదారి పనులు మొదలయ్యాయని అధికారులు తెలిపారు. 401సర్వే నంబర్‌లో 25ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు తహసీల్దార్ పున్నంచందర్ వెల్లడించారు. అయితే, మరో ఐదెకరాల ప్రభుత్వ భూమి కోసం సర్వే చేయాలని సూచించిన కలెక్టర్, పైలాన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిలఖాన్ మాట్లాడుతూ ఈనెల 11న ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాలలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుందని తెలిపారు. ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హేమలత, ఈఈ తానేశ్వర్, డీఈ శంకర్‌రావు, ఏఈలు శ్రీకాంత్, రాంబాబు, డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓ పుల్లయ్య, ఎంపీడీఓ రవికుమార్, ఎంపీఓ శాస్త్రి పాల్గొన్నారు.

అధునాతన సౌకర్యాలతో 'అంకుర'


మాట్లాడుతున్న అంకుర హాస్పిటల్ ఎండీ కృష్ణప్రసాద్

ఖమ్మంవైద్యవిభాగం: అత్యుత్తమ, అధునాతన, నాణ్యమైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా అంకుర ఆస్పత్రి నిర్వహిస్తున్నామని వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వున్నం కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ చల్లగుళ్ల రాకేష్ తెలిపారు. ఖమ్మంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఖమ్మంలోని ఆస్పత్రిలో గతంలో 70పడకలు ఉండగా 120కి పెంచి కొత్త భవనంలో బుధవారం ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆస్పత్రిని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని చెప్పారు. మహిళలు, శిశువులకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఒడిశాలో 14 ఆస్పత్రుల ద్వారా నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ఖమ్మంలో 24 పడకల నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్, 18 పడకల పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ఉండగా.. నవజాత శిశువులకు మెరుగైన వైద్యం అందుతుందని వెల్లడించారు. ఈసమావేశంలో వైద్యులు దుర్గాప్రసాద్, సందీప్‌రెడ్డి, స్పందన, టి.శ్రీనిధి, పూజ పాల్గొన్నారు.

గుట్టపై గుప్తనిధుల కోసం తవ్వకం?

పది రోజుల క్రితం ఘటన, ముగ్గురిపై కేసు

కామేపల్లి: రిజర్వ్ ఫారెస్ట్ భూమిలో అక్రమంగా తవ్వకాలు చేపట్టిన వారిని అటవీ శాఖ సిబ్బంది కామేపల్లి పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేశారు. పది రోజుల క్రితం ఈ ఘటన చోటు చేసకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గతనెల 28న మండలంలోని మద్దులపల్లి సమీపాన రిజర్వ్ ఫారెస్ట్ గుట్టపై రాత్రి 7 గంటలకు కొందరు చేరుకుని భూమి తవ్వసాగారు. ఈ సమయాన బిగ్గరగా అరుస్తూ పసుపు, కుంకుమ చల్లుకుంటుండడంతో మద్దులపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నాగరాజు, ఇద్దరు సిబ్బంది వెళ్లేసరికి సదరు వ్యక్తులు పారిపోయారు. అయితే, భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండలం వేపలగడ్డతండాకు చెందిన గుగులోత్ రాజు పట్టుబడగా విచారించడంతో తనతో ఉన్న వారు కారేపల్లి మండలం మాణిక్యారానికి చెందిన మందుల షాపు యాజమాని జగ్గయ్య, కామేపల్లి మండలం మద్దులపల్లికి చెందిన లింగస్వామిగా చెప్పాడు. వీరిపై అటవీ ఉద్యోగులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. అయితే, గుట్టపై తవ్వకాలు చేపట్టిన ముగ్గురు చాన్నాళ్లుగా ఇక్కడే తిరుగుతున్నారని.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సహకారంతో తవ్వకాలు చేపట్టినట్లు ఆరోపిస్తున్నారు. గుప్త నిధుల కోసమే ఈ తవ్వకాలు చేపట్టినట్లు తెలుస్తుండగా.. మద్దులపల్లి వాసిని కేసు నుంచి తప్పించారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై ఎస్సై సాయికుమార్‌ను వివరణ కోరగా.. గుట్టపై ఉన్న ఓ చెట్టు వేరు కోసం తవ్వకం చేపట్టినట్లు తెలియగా, రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమంగా తవ్వకం చేపట్టడం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం


వాహనంలో బియ్యాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కల్లూరు: కల్లూరులో పాత బస్టాండ్ సమీపాన మంగళవారం పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీలో బొలేరోలో తరలిస్తున్న 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు చంద్రుపట్ల గ్రామానికి చెందిన డ్రైవర్ గోపాలకృష్ణను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ ఎస్‌కే.షాకీర్ తెలిపారు. అంతేకాకుండా ఏపీలోని జయంతి గ్రామానికి చెందిన కాజా రామారావు, బత్తులపల్లికి చెందిన జంగా నరసింహారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ బియ్యాన్ని తల్లాడ నుంచి కాకినాడకు తరలిస్తున్నట్లు సమాచారం.

3.50 క్వింటాళ్లు..

వేంసూరు: మండలంలోని రామన్నపాలెంలో ఒకరి ఇంట్లో నిల్వ చేసిన 3.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి కత్తుల ప్రసాద్, అశోక్, సాయి, అనూష, చారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికులకు గాయాలు

సత్తుపల్లిటౌన్: చెత్త ఎత్తుతున్న మున్సిపల్ కార్మికులను లారీ ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. సత్తుపల్లి బాలాజీ థియేటర్ సమీపాన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ట్రాక్టర్‌లో చెత్త పోస్తుండగా అశ్వారావుపేట వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కార్మికులు ఇడుపులపాటి వెంకటేశ్వరరావు, పి.వెంకటమ్మ, జుంజునూరి సీత, తడికమళ్ల మరియమ్మకు గాయాలు కావడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయగా, బాధితులను కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఎం.డీ.కమల్‌పాషా పరామర్శించారు.

ఆటోడ్రైవర్లపై ఫిర్యాదు, కేసు

కొత్తగూడెంటౌన్: ఆటో కిరాయి విషయంలో ఆటో డ్రైవర్లపై మరో ఆటోడ్రైవర్ ఫిర్యాదు చేయడంతో మంగళవారం కొత్తగూడెం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గౌతంపూర్‌కు చెందిన ఆటోడ్రైవర్ నవీన్‌కుమార్ తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని, రుద్రంపూర్ సెంటర్‌కు రాగా.. అక్కడి ఆటోడ్రైవర్ మరో ముగ్గురిని ఎక్కించాడు. ఇది గమనించిన రుద్రంపూర్ తిలక్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్లు శ్రావణ్, భార్గవ్.. నవీన్‌కుమార్ ఆటోను అడ్డుకుని సీరియల్ ప్రకారం తమ ఆటోల్లోనే ఎక్కించాలని దుర్భాషలాడారు. దీంతో నవీన్‌కుమార్ డయల్ 100కు సమాచారం ఇచ్చి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రావణ్, భార్గవ్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

మందు పిచికారీ చేస్తే.. మాడిన తోట


మొక్కలు చూపిస్తున్న రైతు రామారావు

రఘునాథపాలెం: మిరపతోటను ఆశించిన ముడత నివారణకు మందు పిచికారీ చేస్తే మొక్కలన్నీ మాడిపోవడంతో రైతు కన్నీరు పెడుతున్నాడు. రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తికి చెందిన మెంటం రామారావు ఐదెకరాల్లో మిర్చి సాగు చేశాడు. ఇటీవల పైముడత తెగులు ఆశించడంతో మందు పిచికారీ చేయగా తెగులు తగ్గకపోగా మొక్కల ఇగుర్లు మాడి పోయాయి. కంపెనీ ప్రతినిధులు, డీలర్ చెప్పిన సూచనలు పాటించినా ఇలా జరగడంతో రైతు ఫిర్యాదు మేరకు ఏఓ కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి పరిశీలించారు. మందు శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపిస్తున్నామని, నివేదిక వస్తే విషయం తెలిసిపోతుందని చెప్పారు.

రైల్వే వ్యాగన్ బొగ్గు లోడ్‌లో మృతదేహం

కేటీపీఎస్ ట్రాక్ ఆపర్‌లో గుర్తించిన కార్మికులు


రమేష్ (ఫైల్)

పాల్వంచ/సుజాతనగర్: సింగరేణి నుంచి కేటీపీఎస్‌కు వచ్చిన బొగ్గు వ్యాగన్‌లో ఓ మృతదేహం కనిపించిన ఘటన పాల్వంచలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడెంలోని రుద్రంపూర్ నుంచి కేటీపీఎస్ ఐదో దశకు బీఓబీఆర్ వ్యాగన్‌లో వచ్చిన బొగ్గు సీహెచ్‌పీ ట్రాక్ ఆపర్‌లో అన్‌లోడ్ చేసింది. కాగా అక్కడ విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ట్రాక్ ఆపర్ నుంచి ఓ మనిషి చెయ్యి కనిపించడంతో సీఈ ఎం.ప్రభాకర్‌రావు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన రైల్వే, సివిల్ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ట్రాక్ ఆపర్ నుంచి మృత దేహాన్ని వెలికి తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం పాల్వంచలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడిని సుజాతనగర్ మండలం సీతంపేట గ్రామానికి చెందిన గుగులోతు రమేష్(40)గా గుర్తించారు. అతడికి మతిస్థిమితం సరిగా ఉండదని, సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వచ్చాడని సీతంపేట వాసులు తెలిపారు. కొత్తగూడెం చేరుకుని అప్పటికే బొగ్గు లోడ్ చేసిన రైల్వే వ్యాగన్ ఎక్కి పడుకుని ఉంటాడని, ఎవరూ గమనించకపోవడంతో బొగ్గుతో పాటు ట్రాక్ ఆపర్‌లో పడి మృతి చెంది ఉంటాడని కార్మికులు, స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేటీపీఎస్ ఏడీఈ చలవాది నర్సింహారావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనాథలైన పిల్లలు..

మృతుడు రమేష్ చేపలు పడుతూ, కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడని సీతంపేట వాసులు తెలిపారు. రమేష్ భార్య దివ్య అనారోగ్యంతో రెండు నెలల క్రితమే మృతి చెందింది. దీంతో వారి ఆరేళ్ల కూతురు భవాని, ఐదేళ్ల కుమారుడు మణికంఠ అనాథలుగా మిగిలారు. ఇద్దరు చిన్నారులు హృదయ విదారకంగా రోదిస్తుండడంతో వారిని చూసిన పలువురు కంటతడి పెట్టారు.

చెన్నారంలో నవజాత శిశువు మృతదేహం


శిశువు మృతదేహం వద్ద పోలీసులు, స్థానికులు

నేలకొండపల్లి: నవజాత మగశిశువు మృతదేహాన్ని మండలంలోని చెన్నారంలో గుర్తుతెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లారు. ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి ఉన్న మృతదేహాన్ని మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు తెలిపారు. సోమవారం రాత్రి జన్మించిన శిశువుగా భావిస్తుండగా ప్రసవ సమయాన చనిపోయాడా, పడేశాక చనిపోయాడా తెలియరాలేదు. ఈమేరకు పోలీసులు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు చేరుకుని విచారించారు. గ్రామంలోని పలు చోట్ల చోట్ల సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించడమే కాక స్థానికంగా ఉన్న గ్రామీణ వైద్యుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి పంచాయతీ కార్యదర్శి రవి నేతృత్వాన ఖననం చేశారు.

దాడి ఘటనలో ఐదుగురిపై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం బల్లేపల్లి సెంటర్‌లో ఎర్రా కరుణాకర్‌రెడ్డిపై జరిగిన దాడి ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. రఘునాథపాలెం మండలం చిమ్మపుడికి చెందిన ఎర్రా కరుణాకర్‌రెడ్డి సోమవారం రాత్రి ఖమ్మం వచ్చి ఇంటికి వెళ్తుండగా సమీప బంధువైన ఎం.కరుణాకర్‌రెడ్డితో పాటు మరో నలుగురు దారి కాసి కుటుంబ కలహాల నేపథ్యాన కర్రలతో దాడి చేశారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి

కామేపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని ఒడ్డుగూడెంకు చెందిన తేనే నాగయ్య(55) మూడు రోజుల క్రితం బైక్‌పై వెళ్తుండగా పండితాపురం సంత సమీపాన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనకు ఖమ్మంలో చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు.

జాస్తిపల్లిలో..

కామేపల్లి మండలంలోని జాస్తిపల్లికి చెందిన దేవేండ్ల సీతయ్య(50) కుటుంబ కలహాలతో రెండు రోజుల క్రితం కలుపు మందు తాగగా చికిత్స పొందుతూ ఖమ్మం ఆస్పత్రిలో మంగళవారం మృతి చెందాడు. ఆయన కుమారుడు ఉదయ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

పురుగు మందు తాగిన వ్యక్తి..

కారేపల్లి: కడుపు నొప్పి తాళలేక వ్యక్తి పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండంలోని గోవింద్‌తండాకు చెందిన బానోతు భజన్(42) కడుపునొప్పితో బాధపడుతుండగా చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో ఈనెల 2న రాత్రి పురుగుల మందు తాగిన ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఘటనపై భజన్ కుమారుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్‌ఎంపీ..


కృష్ణారెడ్డి (ఫైల్)

తల్లాడ: మండలంలోని నారాయణపురం సమీపాన సోమవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఆర్‌ఎంపీ మృతి చెందాడు. నారాయణపురానికి చెందిన ఆర్‌ఎంపీ బొగ్గుల కృష్ణారెడ్డి(45) రాత్రి బైక్‌పై తల్లాడ సెంటర్‌కు వెళ్లి తిరిగి వచ్చేక్రమాన రోడ్డు దాటుతుండగా తల్లాడకు చెందిన పఠాన్ హుస్సేన్ స్కూటీపై ఎదురుగా అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి బలంగా ఢీకొట్టాడు. ఈఘటనలో కృష్ణారెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయన భార్య రమాదేవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మానవత్వం చాటుకున్న మంత్రి పొంగులేటి



క్షతగాత్రునికి ధైర్యం చెబుతున్న మంత్రి

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి వద్ద మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధైర్యం చెబుతూ ఆస్పత్రికి తరలించారు. తిరుమలాయపాలెం మండలంలో పర్యటించి ఖమ్మం వైపు మంత్రి వెళ్తుండగా కరుణగిరి వద్ద ప్రమాదం జరిగి యువకుడు గాయపడ్డాడని తెలిసి ఆగారు. క్షతగాత్రుడికి ధైర్యం చెబుతూనే కారులో పంపిస్తూ.. ఆలస్యం కాకుండా తన ఎస్కార్ట్ వాహనాన్ని సైతం పంపించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈసందర్భంగా క్షతగాత్రుడితో పాటు పలువురు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి ఖమ్మం మార్కెట్‌కు సెలవులు

ఖమ్మంవ్యవసాయం: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. ఈనెల 10న గురువారం దుర్గాష్టమి, 11న శుక్రవారం మహర్నవమి, 12వ తేదీ శనివారం విజయదశమి, 13వ తేదీ ఆదివారం సాధారణ సెలవు ఉంటాయని వెల్లడించారు. ఇక 14 తేదీ సోమవారం నుంచి కొనుగోళ్లు మొదలవుతాయనే విషయాన్ని రైతులు, వ్యాపారులు గమనించాలని సూచించారు.

రవాణాశాఖలో త్వరలోనే ఖాళీల భర్తీ: డీటీసీ



ఉద్యోగులతో మాట్లాడుతున్న డీటీసీ శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: రవాణా శాఖలో ఖాళీగా ఉన్న ఇన్‌స్పెక్టర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ వెల్లడించారు. సత్తుపల్లి రవాణా శాఖ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఆర్‌సీ కార్డులు పది రోజుల్లో చేరవేస్తామని తెలిపారు. సత్తుపల్లి, కల్లూరులో రవాణా శాఖ కార్యాలయం, చెక్‌పోస్టులకు స్థలాలు కేటాయించాక భవనాలు నిర్మిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం ఇన్‌చార్జ్ రవాణా శాఖాధికారి వెంకటరమణ, సత్తుపల్లి ఎంవీఐ జె.శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోటీని జయించి.. ఉద్యోగాలు సాధించి..

- కుటుంబీకుల ప్రోత్సాహంతో విజయం
- ఉపాధ్యాయులుగా ఎంపికైన గిరిజన యువతులు

ఇల్లెందురూరల్: ఎంచుకున్న లక్ష్యం, వారి ఆశయం ముందు పేదరికం చిన్నబోయింది. చిరుప్రాయం నుంచి శ్రమ, పట్టుదలనే నమ్ముకొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించారు. ఇంటర్‌లోనూ మంచి మార్కులు సాధించి తమ లక్ష్యానికి అనుగుణంగా అడుగులు వేశారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో పోటీ అధికంగా ఉన్నా.. ఆ ఉద్యోగం తమదే అన్నట్లుగా పరీక్షకు సన్నద్ధమైన ఆ గిరిజన యువతులు విజయం సాధించారు.

చంటి పాపను లాలిస్తూ..

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో డిగ్రీ చదివిన బానోతు ఆశ ఆతర్వాత భద్రాచలంలో బీఈడీ పూర్తి చేసింది. ఆపై ఆమెకు ఇల్లెందు మండలంలోని బోయితండా గ్రామపంచాయతీ పరిధి ఎల్లన్ననగర్‌కు చెందిన చిన్నతో వివాహమైంది. భర్త ప్రోత్సాహంతో ప్రభుత్వ కళాశాలలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ పూర్తిచేయగా కేజీబీవీలో అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించింది. ఆరు నెలల చంటిపాపను లాలిస్తూనే డీఎస్సీకి సన్నద్ధమైంది. డీఎస్సీ ఫిజిక్స్ విభాగంలో నాలుగు పోస్టులే ఉన్నా పట్టుదలతో చదివిన ఆశ జిల్లాలో ద్వితీయ స్థానం, ఎస్టీ కేటగిరీలో మొదటి ర్యాంకు సాధించి ఉపాధ్యాయ కొలువు వశం చేసుకుంది. భర్త ప్రోత్సాహంతోనే తన విజయం సాధ్యమైందని ఆమె చెబుతోంది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

ఇల్లెందు మండలంలోని రేపల్లెవాడకు చెందిన లావుడ్యా తులస్యా, పరంగ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. తండ్రి తులస్యా ఆటో నడుపుతూ ఇరువురు కుమార్తెలను మంచిగా చదివించి వివాహం



కుమార్తెతో బానోతు ఆశ



తల్లిదండ్రులతో లావుడ్యా మంజుల

చేశాడు. చిన్నకుమార్తె మంజుల పదో తరగతి వరకు స్థానిక హైస్కూల్‌లో, ఇల్లెందులోని సాహితి జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీలో 921 మార్కులతో పాసైంది. క్రీడలపై మక్కువతో ఇంటర్‌లోనే జాతీయ స్థాయి పోటీల్లో హైజంప్‌లో పతకం సాధించింది. క్రీడానైపుణ్యంతో ఓయూ క్యాంపస్‌లో పీఈటీ, డిగ్రీ, బీపీడీ పూర్తి చేసి డీఎస్సీకి సన్నద్ధమైంది. అయితే, డీఎస్సీలో పీఈటీలో ఒకే పోస్టు, బీపీడీ కేటగిరీలో నాలుగు పోస్టులే ఉన్నాయి. అయినా పట్టుదలతో పరీక్షకు సన్నద్ధమై పీఈటీలో జిల్లాలో ప్రథమ స్థానం, బీపీడీ కేటగిరీలో ద్వితీయ స్థానం సాధించి ఉద్యోగం అందిపుచ్చుకుంది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూనే చదివించిన తల్లిదండ్రులే తన విజయానికి కారణమని ఆనందం వ్యక్తం చేస్తోంది లావుడ్యా మంజుల.

అక్కాతమ్ముడు... టీచర్లు!

ఏన్కూరు: ఏన్కూరు మండలం కాలనీ నాచారం గ్రామానికి చెందిన గిరిజనులైన అక్కాతమ్ముడు ఒకేసారి ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించారు. గ్రామానికి చెందిన బొర్రా జ్యోతి స్కూల్ అసిస్టెంట్ తెలుగు, ఆమె సోదరుడు శ్రీను స్కూల్ అసిస్టెంట్ బయాలజీ పోస్టులకు ఎంపికయ్యారు. ఈమేరకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వీరు నియామక ఉత్తర్వులు అందుకోనున్నారు. ఒకేదఫా అక్కాతమ్ముడు ఉద్యోగాలు సాధించడంతో కుటుంబీకులు, బంధువుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కాగా, తండ్రి లేకపోయినా తల్లి రెక్కల కష్టంతో తమను చదివించిందని జ్యోతి, శ్రీను తెలిపారు.



బొర్రా జ్యోతి, శ్రీను

గాంధీపురం రైల్వేస్టేషన్‌ను తరలించొద్దు

కారేపల్లి: కారేపల్లి మండలం గాంధీపురం రైల్వేస్టేషన్‌ను సమీపాన చర్లపల్లిలో నూతనంగా నిర్మించిన డంపింగ్ రైల్వేస్టేషన్ వద్దకు తరలించొద్దని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం పలువురు స్టేషన్‌లో నిరసన తెలిపారు. డోర్నకల్ – భద్రాచలం రోడ్డు రైల్వేలైన్‌కు మధ్యలో గాంధీపురం రైల్వేస్టేషన్ ఏర్పడి 30 ఏళ్లు కావొస్తుండగా, ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారి వెంట గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉందని తెలిపారు. కానీ రైల్వే అధికారులు ప్రధాన రహదారికి కిలోమీటర్ దూరాన చర్లపల్లిలో నూతనంగా ట్రాక్‌లు పెంచి, డంపింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారని, అక్కడకు గాంధీపురం స్టేషన్‌ను తరలిస్తూ టికెట్ బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేశారని వాపోయారు. తద్వారా ప్రయాణికులు ఇబ్బందులు పడనున్నందున గాంధీపురం రైల్వేస్టేషన్‌ను యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఇదిలా ఉండగా చర్లపల్లి వద్ద డంపింగ్ రైల్వే స్టేషన్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్‌ను అధికారులు ప్రారంభించడం గమనార్హం.



గాంధీపురం స్టేషన్‌ను తరలించొద్దని కోరుతున్న గ్రామస్తులు

రాకాసితండా వాసులకు కేవీకే శాస్త్రవేత్తల చేయూత



సరుకులు పంపిణీ చేస్తున్న రవికుమార్ తదితరులు

తిరుమలాయపాలెం: గత నెలలో ఆకేరు వరద కారణంగా తిరుమలాయపాలెం మండలంలోని రాకాసితండా వాసులు సర్వం కోల్పోయారు. దీంతో వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ ఆధ్వర్యాన 77 కుటుంబాలకు పది రకాల నిత్యవసర సరుకులు అందజేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ వి.చైతన్య, పీఎస్ఎం.ఫణిశ్రీ, యంగ్ ప్రొఫెషనల్ డి.శ్రీనివాస్, ఏఈఓ సౌమ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం వరదలతో దెబ్బతిన్న భూములను పరిశీలించి యాసంగిలో పంటల సాగుపై అవగాహన కల్పించారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నిక

దుమ్ముగూడెం/ఏన్కూరు: పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా దుమ్ముగూడెం మండలంలోని వైట్ నాగారం ఎంపీపీఎస్ పాఠశాల, ఏన్కూరు జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు కారంపూడి దశమ్‌బాబు, కూరాకుల సైదయ్య ఎన్నికయ్యారు. పీఆర్‌టీయూ 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పాటుపడతామని తెలిపారు. ఈసందర్భంగా దశమ్‌బాబు, సైదయ్యను ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్‌టీయూ భద్రాద్రి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, బి.రవి, దుమ్ముగూడెం, ఏన్కూరు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంశీమోహన్, డి.శ్రీనివాసరావు, చింతారాజు, బత్తుల వెంకటేశ్వర్లుతో పాటు బి.మల్లికార్జున్‌రావు, నాగరాజు, కేజియ తదితరులు అభినందించారు.



దశమ్‌బాబు



సైదయ్య



గురునాథరెడ్డి

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గురునాథరెడ్డి

ఎర్రుపాలెం: పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడుకు చెందిన జంగా గురునాథరెడ్డి ఎన్నికయ్యారు. ఆయన స్వగ్రామంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వరిస్తుండగా పలువురు అభినందించారు.

రూ.5లక్షల కరెన్సీతో అమ్మవారి అలంకరణ



కరెన్సీ మాలల అలంకరణలో అమ్మవారు

పాల్వంచ: పాల్వంచ ఆదర్శనగర్‌లో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని మంగళవారం రూ.5 లక్షల విలువైన కరెన్సీ మాలలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో కడలి శ్రీనివాసరావు, ఇనపనూరి హిమకిరణ్, తాటికొండ రామకృష్ణ, పాకనాటి నరేష్, దుర్గాప్రసాద్, కల్లూరి ప్రదీప్, మామిడి జగదీష్, సురేష్, చంద్ర వెంకటేశ్వరరావు, నరేష్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

12న అశ్వారావుపేటలో పవర్‌ప్లాంట్ ప్రారంభం

అదేరోజు ఆయిల్‌పామ్ రైతుల సదస్సు

సత్తుపల్లి: అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో రూ.33 కోట్లతో నిర్మించిన పవర్‌ప్లాంట్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఈనెల 12న ప్రారంభించనున్నారని ఆయిల్ పామ్ రైతుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్ తెలిపారు. సత్తుపల్లిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మంత్రి తుమ్మల కృషితో దిగుమతి సుంకం రూ.13వేలు నుంచి రూ.18వేల వరకు చేరుకుందని పేర్కొన్నారు. ఫలితంగా రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు మేలు జరగనుందని తెలిపారు. ఇదేక్రమంలో పామాయిల్‌కు కనీస మద్దతు ధర రూ.20వేలుగా ప్రకటించేలా తుమ్మలతో పాటు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రితో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. కాగా, పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవం సందర్భంగా 12న ఉదయం గంటలకు ఐటీఆర్ శాస్త్రవేత్తలతో అవగాహన సదస్సు ఉంటుందని, రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు చల్లగుళ్ల నర్సింహారావు, బండి గురువారెడ్డి, వేంపాటి లక్ష్మీనారాయణ, కందిమళ్ల కృష్ణారావు, బండి గుర్నాధరెడ్డి, చల్లగుళ్ల నర్సింహారావు, బాలకృష్ణ, రాధాకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రప్రసాద్

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

మేటి ఇన్‌స్టిట్యూట్స్.. తగ్గిన ఆఫర్లు

ఐఐటీలు, ఐఐఎంలు.. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యకు ప్రసిద్ధ విద్యాసంస్థలు! వీటిలో చేరి కోర్సు పూర్తి చేసుకుంటే.. కార్పొరేట్ కొలువులు, కళ్లు చెదిరే వేతనాలు ఖాయమనే అభిప్రాయం! రూ.లక్షలు, వీలైతే కోట్లలో వార్షిక వేతనాలతో కొలువు సొంతం చేసుకోవచ్చనే అభిలాష!! కానీ.. ఈ ఏడాది (2023-24) ఐఐటీలు, ఐఐఎంల విద్యార్థులకు కొంత భిన్నమైన అనుభవాలు ఎదురయ్యాయి. ఐఐఎంల్లో ఆఫర్లు 'ఒకే' అనిపించేలా ఉన్నా.. ఐఐటీల్లో మాత్రం బాగానే తగ్గుదల కనిపించింది!! ఈ నేపథ్యంలో.. 2023-24 బ్యాచ్‌లో ఐఐటీలు, ఐఐఎంల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ట్రెండ్స్‌పై కథనం..

- ప్లేస్‌మెంట్స్‌పై అంతర్జాతీయ పరిణామాలు, ఏఐ ప్రభావం
- గతంతో పోల్చితే తక్కువగానే ఆఫర్లు, వేతనాలు
- డేటా అనలిస్టులు, కోడింగ్‌కు పెరిగిన డిమాండ్

ఐఐటీల్లో 2024 బ్యాచ్ క్యాంపస్ ఆఫర్లలో తగ్గుదల కనిపించింది. తాజా గణాంకాలను పరిశీలిస్తే.. 30 శాతం మంది విద్యార్థులకు ఇంకా ఆఫర్లు అందాల్సి ఉంది. మొత్తం 23 ఐఐటీల్లో మొత్తం 21,500 మంది క్యాంపస్ డ్రైవ్స్‌కు దరఖాస్తు చేసుకోగా.. వారి లో 6,500 మంది ఆఫర్ల కోసం నిరీక్షిస్తున్నట్లు సమాచారం.

అంతర్జాతీయ పరిస్థితులు

ఐఐటీల్లో క్యాంపస్ డ్రైవ్స్‌లో తగ్గుదలకు ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పలు దేశా ల్లో ఆర్థిక మందగమనం, అమెరికా ఎన్నికలు, ఉక్రె యిన్–రష్యా యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తదితర కారణాలతో సంస్థలు నూతన నియామకాల విషయంలో వేచి చూసే ధోరణి అవలంభిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఐఐటీల్లో ఇంటర్నేషనల్ ఆఫర్స్‌పై ఈ ప్రభావం ఎక్కువగానే పడినట్లు చెబుతున్నారు.

ఏఐ, చాట్ జీపీటీ ఎఫెక్ట్

ఐఐటీల్లో క్యాంపస్ డ్రైవ్స్‌పై ఏఐ, చాట్ జీపీటీ ప్రభావం సైతం పడిందనే వాదన వినిపిస్తోంది. చాట్ జీపీటీ, ఏఐ టూల్స్, జెన్ ఏఐ వంటి సాంకేతికతల కారణంగా.. ముగ్గురు చేసే పనిని ఇద్దరు పూర్తి చేస్తున్నారు. దీంతో సహజంగానే నియామకాల్లో 20 నుంచి 30 శాతం మేరకు కోత పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జాబ్ రెడీ స్కిల్స్

ఐఐటీల్లో ఆఫర్లు తగ్గడానికి జాబ్ రెడీ స్కిల్స్ లేమి కూడా కారణమని చెబుతున్నారు. విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలు 80 శాతం మేరకే ఉంటున్నాయని పేర్కొంటున్నారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్ సమయంలో కోర్ నైపుణ్యాలకే ప్రాధాన్యమిస్తున్నారని.. రియల్ టైమ్ ఎక్స్‌పోజర్‌పై దృష్టి పెట్టడం లేదని, ఇదే జాబ్ రెడీ స్కిల్స్ కొరతకు కారణమవుతోందని అంటున్నారు.



డిమాండింగ్ జాబ్ ప్రొఫైల్స్

ఐఐటీ క్యాంపస్ డ్రైవ్స్‌లో జాబ్ ప్రొఫైల్స్‌ను పరిశీలిస్తే.. కోర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ అండ్ ప్రోగ్రామర్స్, డేటా అనలిస్ట్స్, యుఎక్స్ డిజైనర్, ప్రొడక్ట్ డిజైనర్, ఫుల్‌స్టాక్ ఇంజనీర్ జాబ్ ప్రొఫైల్స్‌లో అత్యధిక సంఖ్యలో నియామకాలు జరిగాయి.

డేటా అనలిస్టులకు డిమాండ్

కన్సల్టింగ్, ఫైనాన్షియల్ రంగంలోని సంస్థలు డేటా అనలిస్టుల నియామకాలు ఎక్కువగా చేపట్టాయి. బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్ సంస్థలు.. క్లయింట్స్‌ను, వినియోగదారులను పెంచుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. అందుకే డేటా అనలిస్టులను ఎక్కువగా నియమించుకుంటున్నాయి. అదేవిధంగా కోడింగ్ స్కిల్స్‌కు కూడా డిమాండ్ అధికంగా కనిపించింది. ఐటీ మొదలు ఆన్‌లైన్ టెక్నాలజీస్ ఆధారంగా సేవలందిస్తున్న సంస్థల వరకూ.. అన్ని కంపెనీలు సాఫ్ట్‌వేర్స్, ప్రోగ్రామింగ్, డిజైనింగ్‌కు ప్రాధాన్యమిస్తుండటమే ఇందుకు కారణం.

టాప్ రిక్రూటర్స్ వీరే

ఐఐటీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో.. క్వాల్‌కామ్, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, గూగుల్, బార్‌క్లేస్, ఎస్ఏపీ ల్యాబ్స్, సిటీ బ్యాంక్, వెల్ ఫార్గో, మైక్రోసాఫ్ట్, బీసీజీ, బెయిన్ అండ్ కో సంస్థలు అంతర్జాతీయ ఆఫర్స్ అందించడంలో ముందంజలో ఉన్నాయి. డొమెస్టిక్ ఆఫర్స్ విషయంలో ఉబెర్, హనీవెల్, మైక్రాన్ టెక్నాలజీ, ఓఎన్‌జీసీ, ఫ్లిప్‌కార్ట్, బజాజ్ ఆటో, టాటా స్టీల్, ఎస్‌టీఎం మైక్రో ఎలక్ట్రికల్స్ వంటి సంస్థలు ముందు వరుసలో ఉన్నాయి.

కోడింగ్ నైపుణ్యాలు తప్పనిసరి

ఐఐటీల క్యాంపస్ డ్రైవ్స్‌లో సంస్థలు విద్యార్థుల్లోని కోడింగ్ నైపుణ్యాలపైనే ప్రధానంగా దృష్టి పెట్టాయి. రిటెన్ టెస్టులు, టెక్నికల్ రౌండ్స్‌లో కోడింగ్ సంబంధిత స్కిల్స్‌ను ఎక్కువగా పరిశీలించాయని ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొన్నాయి. కోర్ ఇంజనీరింగ్, సర్క్యూట్ బ్రాంచ్‌లకు సంబంధించి ఆయా విభాగాల్లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ నైపుణ్యాలను పరిశీలించాయని తెలిపారు.

ఐఐఎం క్యాంపస్‌లలో

దేశంలో మేనేజ్‌మెంట్ విద్యకు కేరాఫ్‌గా నిలిచే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లలో ఈ ఏడాది ఆఫర్స్ ఆశావాహంగానే ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం 21 ఐఐఎం క్యాంపస్‌లలో 2023-24లో పీజీ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు 90 శాతం మందికిపైగా ఆఫర్లు లభించాయి. ప్రముఖ ఐఐఎం క్యాంపస్‌లలో నూటికి నూరు శాతం విద్యార్థులకు ఆఫర్లు సొంతమయ్యాయి.

- ఐఐఎం- బెంగళూరు క్యాంపస్‌లో పీజీపీ విద్యార్థులకు సగటున రూ.32.5 లక్షల వార్షిక వేతనంతో ఆఫర్లు లభించాయి.
- ఐఐఎం అహ్మదాబాద్‌లో 100 శాతం ప్లేస్‌మెంట్స్ నమోదయ్యాయి. ఈ క్యాంపస్‌లో సగటు వార్షిక వేతనం రూ.35 లక్షలుగా ఉండడం గమనార్హం.
- ఐఐఎం-కోల్‌కతలో కూడా 100 శాతం ప్లేస్‌మెంట్స్ లభించాయి.
- ఐఐఎం-లక్నోలో సగటు వేతనం రూ.30 లక్షలుగా నమోదైంది.
- ఐఐఎం-ఇండోర్, బోధ్‌గయ తదితర న్యూ జనరేషన్ ఐఐఎంలలో సగటు వేతనాల్లో తగ్గుదల కనిపించింది. అయితే వీటిలో 100 శాతం ప్లేస్‌మెంట్స్ లభించడం విశేషం.

ఈ మూడు రంగాలు

ఐఐఎంలలో 2024 ఫైనల్ ప్లేస్‌మెంట్స్‌లో కన్సల్టింగ్, ఫైనాన్స్, జనరల్ మేనేజ్‌మెంట్ విభాగాల హవా కనిపించింది. అంతర్జాతీయంగా పేరున్న బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్, పీడబ్ల్యూసీ, డెలాయిట్, కేపీఎంజీ, ఈ అండ్ వై తదితర సంస్థలు ఆఫర్ల విషయంలో ముందంజలో నిలిచాయి. వీటితో పాటు బీఎఫ్ఎస్ఐ, ఈ–కామర్స్, ఎడ్‌టెక్, ఫిన్‌టెక్, ఐటీ/ఐటీఈఎస్ సంస్థలు కూడా భారీ నియామకాలు చేపట్టాయి.

కన్సల్టింగ్ హవా

మొత్తం ఆఫర్లలో దాదాపు 40 శాతం కన్సల్టింగ్ సంస్థల నుంచే ఉండటం విశేషం. కార్పొరేట్ కంపెనీలు వ్యాపార ప్రణాళికల విస్తరణలో భాగంగా కన్సల్టింగ్ సంస్థలను సంప్రదిస్తున్నాయి. ఇదే ఇప్పుడు కన్సల్టింగ్ కంపెనీల్లో నియామకాలు భారీగా పెరగడానికి కారణమని చెబుతున్నారు.

- ఈ–కామర్స్, స్టార్టప్స్ ఆఫర్లు భారీగా లభించాయి. ఎప్పటి మాదిరిగానే కన్సల్టింగ్, బీఎఫ్ఎస్ఐ సంస్థలు ఆఫర్లలో ముందు వరుసలో నిలిచాయి. అదే విధంగా మాన్యు ఫ్యాక్చరింగ్ విభాగంలోనూ నియామకాలు ఆశాజనకంగానే కనిపించాయి. వీటిలోనూ అధిక శాతం డేటా అనాలిసిస్, బిగ్ డేటా, మార్కెటింగ్, ఫైనాన్స్ భాగాల్లోనే లభించాయి.

కంపెనీలు కోరుకుంటున్న లక్షణాలు

ఐఐఎం విద్యార్థులకు ఆఫర్లు ఖరారు చేసిన కార్పొరేట్ సంస్థలు.. ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇచ్చాయి. కోర్ స్కిల్స్ కోణంలో సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు సదరు సబ్జెక్ట్‌కు సంబంధించి డిజిటల్ నైపుణ్యాలున్న విద్యార్థుల కోసం ప్రత్యేక దృష్టి పెట్టాయి. అదే విధంగా బిజినెస్ అనలిటిక్స్, డేటా అనలిటిక్స్, డేటా మేనేజ్‌మెంట్ వంటి లేటెస్ట్ స్కిల్స్ ఉన్న విద్యార్థులకు పెద్ద పీట వేశాయని ఆయా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

జాబ్ పాయింట్

సిడ్బీలో 22 కన్సల్టెంట్ క్రెడిట్ అనలిస్ట్ పోస్టులు

లక్నోలోని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బీ).. ఒప్పంద ప్రాతిపదికన కన్సల్టెంట్ క్రెడిట్ అనలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 22.
» **పోస్టుల వివరాలు:** కన్సల్టెంట్ క్రెడిట్ అనలిస్ట్–19, అకౌంట్స్ అండ్ ట్యాక్స్ కన్సల్టెంట్ (ఏటీసీ)–03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** సైకోమెట్రిక్ టెస్ట్, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 10.10.2024.
» పనిచేయాల్సిన ప్రదేశాలు: ముంబై, లక్నో, న్యూఢిల్లీ, అహ్మదాబాద్, చెన్నై.
» వెబ్‌సైట్: https://www.sidbi.in/en/

సిడ్బీలో జూనియర్ లెవల్ ఆఫీసర్ పోస్టులు

లక్నోలోని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బీ).. ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ లెవల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **విభాగాలు:** మిడ్ ఆఫీస్ (మార్కెట్ రిస్క్ మేనేజర్), ఆపరేషనల్ రిస్క్ మేనేజర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ/సీఎఫ్ఏ, బీఈ/బీటెక్, ఎంబీఏ/ఎంఎంఎస్/ఎంఎస్/పీజీడీఎం(ఫైనాన్స్), ఎంఎస్సీ/ఎంఏ (మ్యాథ్స్ /స్టాటిస్టిక్స్/ ఎకనామిక్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** మెరిట్ లిస్ట్, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం:

» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా
» ఈమెయిల్: RIMV_MidOffice@sidbi.in.
» దరఖాస్తులకు చివరితేది: 18.10.2024.
» పని చేయాల్సిన ప్రదేశం: ముంబై.
» వెబ్‌సైట్: https://www.sidbi.in/

సెస్, హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని తెలంగాణ ప్రభుత్వ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **పోస్టుల వివరాలు:** ప్రోగ్రామ్ ఆఫీసర్–01, అకౌంటెంట్స్ ఆఫీసర్–01, అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్–02, అటెండర్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 12వ తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవముండాలి.
» **వయసు:** 21 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం:

» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సంబంధిత సర్టిఫికేట్ల జిరాక్స్ కాపీలతో పాటు డైరెక్టర్, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్, నిజామియా అబ్జర్వేటరీ క్యాంపస్, బేగంపేట్, హైదరాబాద్ చిరునామకు వ్యక్తిగతంగా లేదా రిజిస్టర్డ్/స్పీడ్ పోస్టు ద్వారా నోటిఫికేషన్ వెలువడిన 15 రోజుల్లోగా పంపించాలి.
» **నోటిఫికేషన్ తేది:** 29.09.2024.
» **వెబ్‌సైట్:** http://cess.ac.in/

ట్రిపుల్ ఐటీ డీఎం కర్నూల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

కర్నూల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్(ట్రిపుల్ ఐటీ డీఎం).. తాత్కాలిక ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **విభాగం:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్.
» **అర్హత:** పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.70,000.

ముఖ్య సమాచారం:

» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్, ట్రిపుల్‌ఐటీ డీఎం కర్నూలు, జగన్నాథగట్టు, కర్నూలు చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 22.10.2024.
» వెబ్‌సైట్: http://iiitk.ac.in/

ట్రిపుల్ ఐటీ శ్రీ సిటీ, చిత్తూరులో టీచింగ్ పోస్టులు

చిత్తూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శ్రీ సిటీ(ట్రిపుల్ ఐటీ శ్రీ సిటీ).. టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టులు:** విజిటింగ్ ఫ్యాకల్టీ/అడ్జంక్ట్ ఫ్యాకల్టీ.
» **విభాగాలు:** కంప్యూటర్ అండ్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్, డేటా అనాలిసిస్, ఏఐఎంఎల్, డీప్ లెర్నింగ్, పైథాన్ ఫర్ డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ.
» **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. పని అనుభవం తప్పనిసరిగా ఉండాలి.

ముఖ్య సమాచారం:

» స్కాన్ చేసిన సర్టిఫికేట్‌లు పంపాల్సిన ఈమెయిల్: careers.faculty@iiits.in.
» దరఖాస్తులకు చివరితేది: 15.11.2024.
» వెబ్‌సైట్: https://www.iiits.ac.in/